గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- వేసవి విజ్ఞాన శిబిరాలు ముగింపు కార్యక్రమంలో ఎంఈఓ త్రినాధరావు, ఎస్‌ఐ రమేష్



బాడంగి: కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



తెర్లాం: విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎస్‌ఐ రమేష్

తెర్లాం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని సద్వినియోగం చేసుకుంటే అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందని ఎంఈఓ త్రినాధరావు, ఎస్‌ఐ రమేష్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన వేసవి విజ్ఞాన శిబిరాలు కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో మేలు చేసిందన్నారు. నెల రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదివించడం, చెప్పించడంతో పాటు చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయడం జరిగిందన్నారు. రోజుకో కొత్త విషయం నేర్చుకుని, పిల్లలు సంతోషంగా ఉండేవారని, మరుసటిరోజు కూడా ఎంతో హుషారుగా గ్రంథాలయానికి వచ్చేవారని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి వెల్లడించారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా నిర్వహించిన పలు ఆటల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు ప్రదానం చేశారు. నెలరోజుల పాటు శిబిరానికి హాజరైన విద్యార్థికి రూ.500 నగదు బహుమతిని ఎస్‌ఐ అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ సత్యనారాయణ, హైస్కూల్ హెచ్‌ఎం పాపారావు, క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విస్సు, తెర్లాం–5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం..

రామభద్రపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నెల రోజుల పాటు కొనసాగిన వేసవి విజ్ఞాన శిబిరాలు కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. లైబ్రేరియన్ సత్యవాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీ పరీక్షలు, క్రీడాపోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు దాలినాయుడు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. సర్పంచ్ కె.రమేష్, ఎంపీటీసీ సభ్యుడు డి.శ్రీనువాసరావు సమావేశానికి హాజరై కాసేపు మాట్లాడారు. ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులు ఎన్నో మంచి విషయాలు నేర్చుకున్నారని పేర్కొన్నారు. పుస్తక పఠనం, వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం, క్రీడాపోటీల్లో విశేష ప్రతిభ వారి సొంతమైందన్నారు. గ్రంథాలయాల్లో అనేక పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, ఇక్కడ చదువుకున్న ఎంతోమంది ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు. ఇన్నాళ్లు విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు వై.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



రామభద్రపురం: గెలుచుకున్న బహుమతులను చూపిస్తున్న విద్యార్థులు

బెంబేలెత్తిస్తున్న వడగాడ్పులు

బాడంగి: వేసవి నేపథ్యంలో కాస్తున్న విపరీతమైన ఎండలు, వడగాడ్పులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరిగిపోవడంతో పాటు ఉక్కపోత భయంకరంగా ఉంటోంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ, ఉక్కపోత తగ్గకపోవడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లే పరిస్థితి లేదు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో 42 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. అత్యవసర పనుల నిమిత్తం కూడా ప్రజలు బయటకు వెళ్లకపోవడంతో ప్రధాన రోడ్లు, వీధులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి.

తెర్లాం: ఎండల తీవ్రత రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఉక్కపోత కూడా విపరీతంగా ఉండడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10 గంటల నుంచే ఎండలు విపరీతంగా కాస్తుండడంతో ఎవ్వరూ బయటకు రావడం లేదు. దీంతో ప్రధాన రోడ్లు, వీధులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. అత్యవసర పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చేవారు తప్పనిసరిగా వాటర్‌బాటిల్, గొడుగు వెంట తీసుకువెళ్లాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



తెర్లాం: నిర్మానుష్యంగా తెర్లాం ఎస్సీ కాలనీ వీధి

థాంక్యూ సీఎం సార్..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

బొబ్బిలి: కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిన నేపథ్యంలో వారంతా మండలంలోని పక్కి గ్రామంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడును ఆదివారం కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరించారు. తమ 23 ఏళ్ల నాటి కలను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. అనంతరం థాంక్యూ సీఎం సార్ అని నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, పార్టీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు బొత్స కాశినాయుడు, ఏపీ ఎన్‌జీఓ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

వంగర: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఆర్.జనార్దనరావు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని మగ్గూరు, మడ్డువలస జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్‌సీ, పొల్యూషన్ వంటి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని పోలీసులు సూచించారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని, అధిక లోడు, పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లోకి ఎక్కించవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ పి.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.



వంగర: వాహనదారుడి డ్రైవింగ్ లైసెన్స్ పరిశీలిస్తున్న ఎస్‌ఐ జనార్దనరావు

నేత్ర శస్త్రచికిత్సకు 40 మంది ఎంపిక



వృద్ధురాలి కంటిని పరీక్షిస్తున్న వైద్యురాలు

రేగిడి: మండల కేంద్రంలోని విశ్వసాయి మందిరం వద్ద విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రేగిడి, ఆమదాలవలస, వన్నలి, వెంకంపేట, అప్పాపురం తదితర గ్రామాల నుంచి దాదాపు 100 మందికి పైగా శిబిరానికి హాజరై, తమ కళ్ల ఆరోగ్యాన్ని పరీక్షించుకున్నారు. 40 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేశామని, కంటి ఆపరేషన్ చేసేందుకు వారిని విశాఖపట్నం తరలించినట్లు క్యాంపు కో–ఆర్డినేటర్ ఎం.సాయికుమార్ తెలిపారు. అనంతరం రేగిడి సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ ఆధ్వర్యంలో రోగులు, సిబ్బందికి నారాయణసేవ చేశారు.

విద్యార్థి ప్రతిభ



సాయికిరణ్

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఏపీ ఆర్‌జేసీ ఫలితాల్లో మండలంలోని కారాడకు చెందిన గురుకుల పాఠశాల విద్యార్థి పెంట సాయికిరణ్ ప్రతిభ కనబరిచాడు. సదరు విద్యార్థి బీసీ ఆర్‌జేసీలో రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ గుణుపూరు పురుషోది ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదే పాఠశాలలో చదువుతున్న ఎం.వినయ్‌కుమార్‌కు 58, పి.ప్రకాష్‌కు 115, వి.జీవన్‌కు 189, జి.హరికృష్ణకు 206, బి.సాయికుమార్‌కు 315, బి.సోమశేఖర్‌కు 287, సీహెచ్ శరత్‌చంద్రకు 220, ఎ.కోటేశ్వరరావుకు 310, టి.అరవింద్‌కుమార్‌కు 424, టి.అనిల్ కుమార్‌కు 659 ర్యాంకులు వచ్చాయని పేర్కొన్నారు. వీరంతా రెసిడెన్షియల్ కళాశాలల్లో ఫ్రీ ఎడ్యుకేషన్ పొందుతారని తెలిపారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

రాజాం సిటీ: మండలంలోని గురవాం గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు పొట్నూరు లక్ష్మణరావు, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో హోమాలు, అంకురారోహణం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, స్నపనములు తదితర పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొని, స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కె.నారాయణరావు, ఎం.గంగారావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జోగులు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

రాజాం: పట్టణ పరిధిలోని పొనుగుటివలస గ్రామ సమీపంలోని పలు ఎరువుల దుకాణాల్లో అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో ఎరువుల స్టాక్, ఎరువుల రకాలు, నాణ్యతకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రైతులకు నాసిరకం ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు కొత్త ఎరువుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాజాం, సంతకవిటి మండలాల వ్యవసాయ అధికారులు రేణుకాసాయి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలోని రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రేగిడి: మండలంలోని దేవుదల గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు, ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో ఈసీజీ, ఆర్థో, గైనకాలజీ, జనరల్ సంబంధిత రోగాలకు సంబంధించి, ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు కె.మురళీకృష్ణ, పద్మావతి, అనిరుద్‌కుమార్, సర్పంచ్ కె.గవరయ్య తదితరులు పాల్గొన్నారు.



వృద్ధుడి ఆరోగ్యం పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

విభజన హామీలు నెరవేర్చాలి



బొబ్బిలి: నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

రాజాం సిటీ: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలను తక్షణమే నెరవేర్చాలని సీపీఎం మండల కన్వీనర్ సీహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం విశాఖపట్నంలో జరిగిన బీజేపీ విజయోత్సవ సభకు వ్యతిరేకంగా స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో పార్లమెంట్ సాక్షిగా ఆంధ్రాకు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేస్తామని చెప్పి, ఏ ఒక్క హామీని అమలు చేయలేదని తెలిపారు. విశాఖపట్నంకు రైల్వేజోన్, వెనకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక నిధులు వంటి ఎన్నో హామీలను కేంద్రం ఇచ్చి, విస్మరించిందని దుయ్యబట్టారు. దేశానికే వెన్నెముక అయిన విశాఖస్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ సంస్థలకు అమ్మేందుకు ప్రయత్నాలు చేస్తుండడం దారుణమని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. గత తొమ్మిదేళ్లగా ఆంధ్రాకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన అన్యాయాన్ని కప్పిపుచ్చుకునేందుకే విశాఖలో విజయోత్సవ సభ నిర్వహించారని విమర్శించారు. అనంతరం విశాఖ సభకు హాజరైన అమిత్ షాను ఉద్దేశించి, పార్టీ శ్రేణులు అమిత్ షా గోబ్యాక్.. గో బ్యాక్ అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాజేష్, గిరి, అచ్యుతరావు, సుధాకర్, శంకరరావు, చిన్నబాబు, శ్రీను, శోభన్‌బాబు, రవి, గురువులు తదితరులు పాల్గొన్నారు.



రాజాం సిటీ: నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు

తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో దేశం అధోగతి పాలైందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్న ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఆదివారం విశాఖపట్నంలో పర్యటించిన కేంద్రమంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా గో బ్యాక్ అమిత్ షా అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు, సీపీఎం నాయకులు ఎస్.గోపాలం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, పట్టణ అధ్యక్షుడు మునకాల శ్రీనివాసరావు, సీపీఐ(ఎంఎల్) నేతలు శ్రీరామ్మూర్తి, పీసీసీ సభ్యుడు మువ్వల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమిత్ షా..
గో బ్యాక్..

బొబ్బిలి: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా విశాఖ పర్యటనను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ సహా వామపక్ష పార్టీల నాయకులు స్థానిక తాండ్రపాపారాయ సెంటర్‌లో ఆదివారం నిరసన చేపట్టారు.

పంపిణీకి జేవీకే కిట్లు సిద్ధం

- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- తొలిరోజే విద్యార్థుల చేతికి జేవీకే కిట్లు
- పాఠశాలలకు కిట్లు తరలించిన అధికారులు

తెర్లాం: పాఠశాలల పునఃప్రారంభం రోజునే జేవీకే (జగనన్న విద్యాకానుక) కిట్లు పంపిణీకి అధికారులు చర్యలు చేపడుతున్నారు. వేసవి సెలవులు ప్రస్తుతం ముగియడంతో సోమవారం నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేయనున్నారు. ఈ మేరకు ఆదివారం తెర్లాం పాఠశాలలో తరగతుల వారీగా జేవీకే కిట్లు అందజేసేందుకు సిబ్బంది వాటిని వర్గీకరించి, సిద్ధం చేశారు.

రామభద్రపురం: బొబ్బిలి నియోజకవర్గంలోని రామభద్రపురం మండలంలో 57 ప్రభుత్వ పాఠశాలల్లో 4,712 మంది, బొబ్బిలి మండలంలోని 91 పాఠశాలల్లో 7,994 మంది, తెర్లాం మండలంలోని 67 పాఠశాల్లో 4,602 మంది, బాడంగి మండలంలోని 38 పాఠశాలల్లో 3,800 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ జేవీకే కిట్లు సోమవారం అందించనున్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులు, సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు. జేవీకే కిట్‌లో పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం, షూ, సాక్సులు, బెల్టు, బ్యాగు ఉంటాయి. ఇప్పటికే మండలంలోని స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు జేవీకే కిట్లను అధికారులు తరలించారు.

వంగర: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జేవీకే కిట్లు పంపిణీ చేయడం జరిగిందని ఎంఈఓ వై.దుర్గారావు అన్నారు. మండలంలోని మొత్తం 50 పాఠశాలల్లో 3,500 మంది విద్యార్థులకు వీటిని సోమవారం అందించనున్నామని ఎంఈఓ తెలిపారు.



తెర్లాం హైస్కూల్‌లో విద్యార్థులకు అందజేసేందుకు జేవీకే కిట్లు సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు



రామభద్రపురం: జగనన్న విద్యాకానుక కిట్లు పరిశీలిస్తున్న ఎంఈఓ తిరుమలప్రసాద్



వంగర: వ్యాన్‌లో పాఠశాలలకు జేవీకే కిట్లు తరలిస్తున్న దృశ్యం

జెడ్పీ వైస్ చైర్మన్ చేతులమీదుగా..

సంతకవిటి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు చేతులమీదుగా విద్యార్థులకు జేవీకే(జగనన్న విద్యాకానుక) కిట్లు సోమవారం పంపిణీ చేయనున్నామని ఎంఈఓ బి.శాంతకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

వర్మీకంపోస్ట్ తయారీకి చర్యలు



ఎస్‌డబ్ల్యూపీసీ ఫిట్‌లలో పశువుల పేడ, గెత్తం వేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లు

తెర్లాం: స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం)లో వర్మీకంపోస్ట్ తయారీకి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ రాంబాబు ఆదేశాల మేరకు ఆదివారం పంచాయతీ ఈఓ సూరిబాబు పర్యవేక్షణలో గ్రీన్ అంబాసిడర్లంతా కేంద్రంలోని ఫిట్‌లలో పశువుల పేడ, గెత్తం వేసే పనులు చేపట్టారు. ఇక్కడ తయారయ్యే ఎరువును రైతులకు రాయితీపై అందజేసి, పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు విగ్రహ ప్రతిష్ట

బాడంగి: మండలంలోని ముగడ గ్రామంలో కొత్తగా నిర్మించిన రామాలయంలో సీతారామాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఆలయ ప్రారంభోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం హోమం, సూర్యనమస్కారాలు, ధాన్యాధివాసం, యంత్రపూజలు చేశారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



మురుగు కాలువల నుంచి బయటకు తీసిన పూడికలు

రాజాం: పట్టణ పరిధిలోని ఆదర్శనగర్, అమ్మవారి కాలనీ, మెంటిపేట కాలనీలో పారిశుద్ధ్య పనులు ఆదివారం చురుగ్గా చేపట్టారు. మురుగు కాలువల్లో పూడికలు తొలగించి, డంపింగ్ యార్డులకు తరలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ ఈ పనులను పర్యవేక్షించడంతో పాటు ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. అనవసరంగా ఇంటి బయట చెత్త వేయకూడదని, పరిసరాల శుభ్రత పాటించాలని తెలిపారు.

నేడు కొండచాకరాపల్లిలో గడప గడపకు..

వంగర: మండలంలోని కొండచాకరాపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నాయకులు, అధికారులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటే కార్యక్రమంలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ సభ్యులు

బొబ్బిలి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి అన్నారు. పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. సంస్థ సభ్యులంతా మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమలో సంస్థ సభ్యులు గోవిందనాయుడు, చంద్రినాయుడు, సత్తిరాజు, సత్యనారాయణ, శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని మెంటిపేట, మల్లిఖార్జున కాలనీలో తాగునీటి సరఫరాలో సోమవారం అంతరాయం ఏర్పడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా పైపులైన్ దెబ్బతిందని, దీని మరమ్మతుల నేపథ్యంలో ఈ అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయనున్నామన్నారు.